# ఎన్నికల్లో గెలిపిస్తే మన్యం రూపురేఖలు మారుస్తా

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు**



చర్ల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు

చర్ల, నవంబర్ 21: ఎన్నికల్లో గెలిపిస్తే మన్యం రూపురేఖలు మారుస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం ఆయన కమ్యూనిస్టులకు కంచుకోటలైన బోదనెల్లి, యర్రబోరు, ఆర్.కొత్తగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఆదివాసీలకు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బోదనెల్లిలో గ్రామస్తులతో కోయ భాషలో మాట్లాడి, కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆర్.కొత్తగూడెం ప్రదాన కూడలిలో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పర్యటనలో నాయకులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, రావులపల్లి రాంప్రసాద్, కొటేరు శ్రీనివాసరెడ్డి, గొర్ల రాజబాబు, తుర్రం రవి, కొసరాజు కుమార్‌రాజా, శ్రీనివాసరాజు(వాసు), అజీజ్, సోయం కృష్ణవేణి పాల్గొన్నారు.

## కేసీఆర్ పథకాలే శ్రీరామరక్ష

దుమ్ముగూడెం, నవంబర్ 21: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని లచ్చిగూడెం, పత్తిపాక, జిన్నెగట్టు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, నాయకులు కణితి రాముడు, వీరాస్వామి పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

దుమ్ముగూడెం, నవంబర్ 21: నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. రేగుబల్లి గ్రామంలో మంగళవారం ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్లంను ప్రజలను ఓట్లు అభ్యర్థించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు పూర్ణయ్య, నాగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నె సత్యనారాయణమూర్తి



దుమ్ముగూడెంలో ఓటర్లతో తెల్లం వెంకట్రావు

## ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష



ముక్కోటి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఈవో రమాదేవి

పర్ణశాల, నవంబర్ 21 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల ఆలయంలో వచ్చే నెల డిసెంబర్ 23న జరిగే ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై భద్రాచలం రామాలయ దేవస్థాన ఈవో రమాదేవి ఆలయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం పర్ణశాల దేవాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో అర్చకులు, అధికారులతో మాట్లాడారు. వచ్చేనెల 23న ముక్కోటి ఏకాదశి, 22న గోదావరిపై తెప్పోత్సవం కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పర్ణశాల గోదావరిలో, సీతమ్మ బ్యారేజ్ నిర్మాణంలో భాగంగా నిర్మించిన కరకట్ట వల్ల గోదావరి నదిపై బోటులో తిరుగుతూ పరిశీలించారు. ఏఈవోలు శ్రావణ్ కుమార్, భవాని రామకృష్ణ, ఆలయ ఈఈ రవీందర్, అర్చకులు పాల్గొన్నారు.

## రాములోరి నిత్య కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాద్రి రామయ్య దివ్యక్షేత్రంలో మంగళవారం తెల్లవారుజామున అర్చకులు సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు సేవ నిర్వహించారు. సేవాకాలం, నిత్య పూజలు, నిత్యహోమాలు, నిత్య బలిహరణం చేపట్టారు. అనంతరం నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి సంప్రదాయబద్ధంగా నిత్యకల్యాణం చేశారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

## నేటి నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు

భద్రాచలం, నవంబర్ 21: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయ పరిధిలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 23న స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శన టికెట్లను bhadradritemple. telangana. gov. in అనే వెబ్‌సైట్‌లో ఉంచుతారు. టికెట్ల ధరలు వరుసగా రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500, రూ. 250, స్వామివారి పరోక్ష సేవలకు ధరలు రూ.2 వేలు, రూ.వెయ్యిగా నిర్ణయించారు. టిక్కెట్లు బుక్ చేసుకున్న వారు వచ్చే నెల 13 నుంచి ఆలయ పరిధిలోని తానీషా కల్యాణ మండపంలోని దేవస్థానం కార్యాలయం (సీఆర్వో)లో ఒరిజినల్ టికెట్లు పొందవచ్చని ఆలయ ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.

## నేటి రామయ్య హుండీల లెక్కింపు

సీతారామచంద్రస్వామి పరిధిలోని హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కిస్తున్నట్లు ఈవో ఎల్.రమాదేవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. భక్తులు స్వామివారికి హుండీల్లో సమర్పించిన కానుకలు, నగదును లెక్కిస్తామన్నారు.

## టెంట్‌హౌస్ యజమానుల నూతన కమిటీ ఎన్నిక



సంఘ సభ్యులకు కుక్కర్‌ను బహుమతిగా అందజేస్తున్న నూతన కమిటీ కార్యవర్గం

భద్రాచలం, నవంబర్ 21: భద్రాచలం టెంట్ హౌస్ యజమానుల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం ఏపీ పరిధిలోని ఎటపాకలో జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా తోట శేషసాయి, వైస్ ప్రెసిడెంట్లుగా తంబళ్ల కృష్ణార్జున రావు, యాదగిరి, కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా గంగాధర్ వినాయక్, గౌరవ అధ్యక్షుడిగా షఫీ, గౌరవ సలహాదారులుగా ద్రాక్షారం శ్రీనివాస్, ఖాదర్ తంబి ఎన్నికయ్యారు.

## రామయ్య దర్శనానికి పాదయాత్ర



పాదయాత్రగా రామయ్య దర్శనం కోసం వస్తున్న భక్తులు

భద్రాచలం, నవంబర్ 21 : భద్రాద్రి రామయ్యను దర్శించుకోవాలనే సంకల్పంతో ఏపీలోని కండ్రికగూడెం నుంచి సుమారు 200 మంది రామభక్తులు భద్రాచలానికి పాదయాత్రగా వచ్చారు. గత 11ఏళ్లుగా వారు కార్తీక మాసంలో రామయ్యను దర్శించుకునేందుకు వస్తున్నారు. మంగళవారం ఉదయం వచ్చిన వారికి సాయి కుటుంబం భద్రాచలం వారి ఆధ్వర్యంలో కరకట్ట వద్ద ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి రామాలయానికి చేరుకొని గిరి ప్రదక్షిణ చేశారు. విషయం తెలుసుకున్న దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవాని రామకృష్ణ వారిని చిత్రకూట మండపంలో కూర్చోపెట్టి అర్చకుల ద్వారా వారికి రామాయణ విశిష్టతను, రామనామం జపిస్తే వచ్చే ఫలితం గురించి వివరించారు. అనంతరం వారికి అంతరాలయంలోని మూలవరుల దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వారు హరిహర అయ్యప్ప దేవస్థానం వారు ఏర్పాటుచేసిన అల్పాహారం స్వీకరించారు. దేవస్థానం వారు వారికి ఉచిత అన్నదాన సత్రంలో భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా కండ్రిగూడెం సాయిబాబా ఆలయ వ్యవస్థాపకులు ఆంజనేయులు భద్రాచలం సాయి కుటుంబానికి చెందిన రావి రామ్మోహనరావు, కొండ బాబా తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పెనగన మెట్టలో రామయ్య కల్యాణం



పెనగనమెట్టలో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, నవంబర్ 21: ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పది రోజుల పాటు భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం కొవ్వూరు మండలం పెనగన మెట్ట గ్రామంలో అర్చకులు సీతారాముల కల్యాణ వేడుక నిర్వహించారు. స్వామివారికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్ర ధారణ చేశారు.

## పవర్ లిఫ్టింగ్‌లో భద్రాచలం వాసికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన రామ్మోహనరావు

భద్రాచలం, నవంబర్ 21 : భద్రాచలం పట్టణానికి చెందిన ఐటీసీ పీఎస్‌పీడీ విశ్రాంత ఉద్యోగి గాలి రామ్మోహనరావు(సిటీ స్టైల్ జిమ్) పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాల మీద పతకాలు సాధిస్తున్నారు. ఈ నెల 19న తెలంగాణ స్పోర్ట్స్ అండ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లో నిర్వహించిన తెలంగాణ చాంపియన్‌షిప్ 2023లో మాస్టర్ విభాగంలో 105 కిలోల కేటగిరిలో ఆయన బంగారు పతకాన్ని సాధించి, డిసెంబర్ 20 నుంచి 23వరకు ముంబైలో జరిగే జాతీయస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన బెంచ్‌ప్రెస్ పోటీలో కూడా సిటి స్టైల్ జిమ్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు బంగారు పతకం సాధించారు. అందులో కూడా రామ్మోహనరావు ఉన్నారు. గతంలో కూడా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఆయన సత్తా చాటారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రామ్మోహనరావును పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, గ్రీన్ భద్రాద్రి టీం, ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవరెడ్డి తదితరులు అభినందించారు.

## అభయాంజనేయుని సన్నిధిలో పూజలు



అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి

చర్ల, నవంబర్ 21: కార్తీకమాసం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.